Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 191 | Tuesday : 08.07.2025 | Price : 3/- | Pages : 4


అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :191 | మంగళవారం 8 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774



# టెక్నాలజీ వినియోగించండి

- క్రైం రేట్ జీరో కావాలి
- క్రైం హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు
- జీరో క్రైం రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలి
- సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలి
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలి
- రియల్ టైమ్ గవర్నెన్స్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైం రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు. సోమవారం ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి.. దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని.. పోలీసులకు సహకరించని - మిగతా 3లో



## జనాభా లెక్కలు.. వెబ్ పోర్టల్ ద్వారా స్వీయ గణన

- జన గణన కోసం ఈసారి కొత్తగా వెబ్ పోర్టల్
- దేశవ్యాప్తంగా జనాభా లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.
- దేశవ్యాప్తంగా తొలిసారి డిజిటల్ పద్ధతిలో జనాభా లెక్కలు
- జనాభా లెక్కల ప్రక్రియను ఆధునీకరించేందుకు డిజిటల్ సెన్సెస్

## చంద్రబాబు వంద చెబితే.. లోకేష్ రెండొందలు చెబుతున్నాడు



- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ
- చంద్రబాబు అసలు సూపర్ సిక్స్ వాగ్దానాలు ఎందుకు ఇచ్చారు?
- ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయ్యరా?
- అడిగితే మక్కెలు విగకొడతాం, తాట తీస్తాం అని చంద్రబాబు, పవన్ కల్యాణ్ అంటున్నారు.
- కూటమి అధికారంలోకి వచ్చి ఒక్క ఉద్యోగం ఇచ్చిందా?.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కాకినాడ**

చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా మహిళలు, రైతులు కచ్చింగా మోసపోతారని.. ఇలా మాయమాటలు చెప్పేవాళ్లను మోసగాళ్లు అనడంలో తప్పే లేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం వంగా గీత అధ్యక్షతన పిఠాపురంలో జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో బొత్స పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు అసలు సూపర్ సిక్స్ వాగ్దానాలు ఎందుకు ఇచ్చారు? ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయ్యరా?. అడిగితే మక్కెలు విగకొడతాం, - మిగతా 3లో

## ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌ల నియామకం



- సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేయడంలో కాంగ్రెస్ నిమగ్నం
- ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నియమించిన టీపీసీసీ..
- 10 జిల్లాల ఇన్‌ఛార్జ్‌లతో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జూమ్ వేదికగా సమావేశం
- త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు



## అవును.. నేను పాక్ ఆర్మీ ఏజెంట్‌నే

- ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవూర్ హుస్సేన్
- పాకిస్తాన్ ఆర్మీకి అత్యంత విశ్వసనీయమైన ఏజెంట్‌గానూ తాను పనిచేశా
- ముంబై ఉగ్రదాడుల కేసులో అమెరికా నుంచి అప్పగింత మీద వచ్చిన రాణా..
- తాను, తన మిత్రుడు డేవిడ్ హెడ్‌లీతో కలిసి లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ ద్వారా పలు శిక్షణా శిబిరాల్లో పాల్గొన్నట్టు వెల్లడి



## భారత్, పాక్‌ను ఒకే త్రాసులో తూకం వేయలేం

- పాక్ ఉగ్రవాద మద్దతుదారని, భారత్ ఉగ్రవాద బాధిత దేశం
- ఉగ్రవాదులకు మౌనంగా మద్దతు ఇవ్వడం కూడా ఆమోదయోగ్యం కాదు
- 'ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తున్నాం.
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

# తెలంగాణ వేదికగా క్రీడలు నిర్వహించాలి

- కేంద్ర క్రీడాశాఖ మంత్రితో సీఎం రేవంత్ భేటీ
- రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చ
- కీడలు సంబంధించి అనేక స్టేడియంలతో పాటు వివిధ రకాల ఏర్పాట్లు
- జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణలో మౌలికంగా వసతులు ఉన్నాయి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ**

ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. కేంద్ర క్రీడలు, కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. తెలంగాణలో క్రీడా యూనివర్సిటీ, ఖేలో ఇండియాపై చర్చించినట్లు సమాచారం. తెలంగాణ వేదికగా అనేక క్రీడలు నిర్వహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రికి వినతి చేశారు. రాష్ట్రంలో క్రీడలకు ఏ విధంగా ప్రాచుర్యం కల్పిస్తున్నామనే విషయాన్ని తెలిపారు. క్రీడలు సంబంధించి అనేక స్టేడియంలతో పాటు వివిధ రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు సీఎం. గతంలో కూడా పలు అంశాలపై కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి పలు వినతి పత్రాలను అందజేశారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు తెలంగాణలో మౌలికంగా వసతులు ఉన్నాయని.. అలాగే 2002- 2003లో జరిగి ఏషియన్ గేమ్స్‌కు సంబంధించి ఆనాడు ఏ విధంగా హైదరాబాద్ వేదికగా మారిందనే విషయాన్ని కేంద్రమంత్రికి తెలియజేశారు. క్రీడా పరంగా రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తున్నామనే విషయాన్ని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయకు సీఎం వివరించినట్లు తెలుస్తోంది. - మిగతా 3లో

# కుప్పంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**
కుప్పంమండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి రాజ్ కుమార్,కుప్పం మండల అధ్యక్షులు మురుగేష్ ఆధ్వర్యంలో బాణసంచా కాలుస్తూ కేక్ కట్ చేస్తూ వేడుకలు, జరిగాయి.ఈ కార్యక్రమానికిముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ సాంబశివం, కడ అడ్వైజరీ కమిటీ మెంబర్ రామ చంద్రన్,యూనిట్ కో ఇన్చార్జ్ విభూషణం, రైతు సంఘం రాజప్ప, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివ రావు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ సామాజిక సంస్థ అని ఒక మాదిగ సామాజిక వర్గానికే కాకుండా సమాజంలోని బడుగు బలహీన వర్గాల పీడిత వర్గాల తరఫున బలమైన పోరాటం చేస్తుందని, ఎమ్మార్పీ ఎస్ ఉద్యమం కీర్తిని కొనియాడారు.ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజ్ కుమార్, మండల అధ్యక్షులు మురుగేష్ సంయుక్తంగా మాట్లాడుతూ.. మంద కృష్ణమాదిగ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి31 సంవత్సరాలు పూర్తి కావడం జరిగిందని, ఈ సందర్భంలో ఒక మాదిగ జాతి పక్షాన కాకుండా సమాజంలోని ప్రతి పీడిత వర్గాల గొంతుకై నిలిచిందని తెలిపారు.ఈ 31 సంవత్సరాల ఉద్యమంలో ఆరోగ్యశ్రీ,వృద్ధులు వితంతుల పింఛను పెంపు,లాంటి సామాజిక న్యాయాలతో పాటు ఎంఆర్పిఎస్ వర్గీకరణ కూడా సాధించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సీనియర్ నాయకులు పాపన్న మాదిగ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో చల్దిగానిపల్లిరమేష్, బోధ గుట్టపల్లి రాజేష్,నారాయణప్ప, డీకేపల్లి యువకులు దుర్గాప్రసాద్, కదిరప్ప, సతీష్, లక్ష్మణ్, రాము, సింగారు వేలు మహిళా నాయకురాలు శాంతి, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు బాసటగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ

## సీయం సహాయ నిధి ద్వారా ఆప్తులకు ఆపన్న హస్తం

## 8మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**
చిత్తూరు పార్లమెంటుపరిధిలోని పలు బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గు మళ్ళ ప్రసాదరావు. ఆపదలో ఉన్నఆప్తులకు ఆపన్నహస్తాన్ని అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎనిమిది మంది బాదితులకు సుమారు 13, 27,560 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకున్నారు. చిత్తూరులోని ఎంపీ కార్యాలయంలో బాధితులకు సీఎం రిలీజ్ ఫండ్ చెక్కులను అందజేశారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంకోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని, పేదప్రజల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఉన్న చిత్తశుద్ధిని వివరించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పొందిన వారిలో పెనుమూరు మండలం, పెలితల్లు గ్రామానికి చెందిన యన్. నాధముని ( 42,746),జీడీ నెల్లూరు మండలం, వింజం గ్రామానికి చెందిన కె.మోహన్ రెడ్డి (44,195),ఐరాల మండలం, పొలకల గ్రామానికి చెందిన బేబీ ప్రత్యూష (35, 917), పుంగనూరు, తేరువీధికి చెందిన బి.విజయకుమార్ (2,00,000), ఐరాల మండలం, ఐరాల గ్రామానికి చెందిన రాజారెడ్డి (1,15000), వెదురు కుప్పం మండలం పెరుమళ్ళపల్లి గ్రామానికి చెందిన రవిబాబు (2,09, 945), చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 190 రామాపురానికి చెందిన దేవేంద్రబాబు (51,385), తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట గ్రామానికి చెందిన జి.గిరిబాబు (6,28,372) ఉన్నారు.కష్టాలలో ఉన్నవారందరికీ అండగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గు మళ్ళ ప్రసాదరావుకు ఈ సందర్భంగా బాదిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. ప్రజల కష్టాలు తెలిసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు లాంటి వారు చిత్తూరు పార్లమెంటు సభ్యులుగా ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

# అన్నదాన కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**



శ్రీకాళహస్తిపట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ కూడలి నందు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదినం పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పెళ్లి మండపం కూడలి నందు 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించిన తిరుపతి జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు ఇర్ల. రాజా మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రిటైర్డ్ డిప్యూటీ తహసిల్దార్ మాసారుపు వెంకటసుబ్బయ్య మాదిగ, శ్రీకాళహస్తి నియోజవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్ మాదిగ, శ్రీకాళహస్తి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు వెంకటముని మాదిగ, మాసారపు శ్రీనివాసులు, మోహ న్, జగదీష్, వంశి, దేసయ్య, శీను, విష్ణు, భాస్కర్ తదితరులు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



# శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**
పెరుమాళ్ళపల్లి శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో రోజువారి జరిగే మండల అభిషేక పూజాకార్యక్రమంలో భాగంగా ఈనాటి ఉభయ దాతలు, కుమ్మతల కృష్ణారెడ్డి, మరియు బోడి రెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమం నిర్వహించారు.

# బుద్ధుని విగ్రహాలపై ధ్వంసం చేసిన వారిపై

## కుప్పం కడ పిడికి ఫిర్యాదు చేసిన భారతీయ అంబేద్కర్ సేన నాయకులు,







**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**
అన్నమయ్యజిల్లా మదనపల్లిరూరల్ మండలం అంకిశెట్టిపల్లి పంచాయతీకి చెందిన బుద్ధుని కొండపై నెలకొని ఉన్న విగ్రహాలపై దుర్మార్గులు దాడి చేయడం జరిగింది.భారతీయ అంబే ద్కర్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు పిటీఎం శివప్రసాద్, దాడిపై మదనపల్లి పోలీసులకు ఫిర్యా దు చేస్తే పోలీసులు పట్టించుకోక నిర్లక్ష్యం వహించడంతో,శాంతియుతంగా నిరసన తెలియ జేసి నందుకు పిటిఎం శివప్రసాద్ మీద అక్రమకేసులు బనాయించి నిర్బం ధించి,ఆయనమీద దాడిచేయడం జరిగింది. ప్రస్తుతం ఆయన కోలార్ జాలప్ప హాస్పిటల్ నందు గాయాలు పాలై చికిస్తా పొందుతున్నారు. ఆయనకు ఏం జరిగినా అన్నమయ్యజిల్లా ఎస్పీ బాధ్యత వహిం చాలి.ఈ విషయంపై కుప్పం నడిబొడ్డున ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంకు పూలమా లలు వేసి భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షులుయు గణపతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ, బుద్ధుని విగ్రహం పై దాడి చేసి సీసీ కెమెరాలు ధ్వంసం చేయడం దుర్మార్గమని, ఈ విషయంపై పిటి ఎం శివప్రసాద్ గారు శాంతియుత నిరసనతెలియజేస్తే అక్రమంగా ఆయన మీద నాన్ బైలబుల్ సెక్షన్ కేసులు బనాయించడం దుర్మార్గ మని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రపంచం శాంతికి నిలయమైన ధ్వంసం చేయడం దుర్మార్గ మని తెలిపారు. తక్షణ మే ప్రభుత్వం స్పందించి ఈ దుర్మార్గాలపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని పీటీఎం శివప్రసాద్ మీదపెట్టినటు వంటి అక్రమ కేసులు కేసులు ఎత్తివే యాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన అధికార ప్రతినిధి వినోద్, జిల్లా ప్రచార కార్యదర్శి శంకరప్ప, నియోజకవర్గ నాయకులు ఎల్ల ప్ప, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవికుమార్, మండల నాయకులు నాగభూషణం, నాలుగు మండలాల నాయకులు పంచాయతీ నాయకులు భారతీయ అంబేద్కర్ సేన కార్యకర్త లు, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యదర్శి లక్ష్మీకర్‌కు ఘనసన్మానం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**
అన్నమయ్యజిల్లా పీలేరు మండలం టిడిపి కార్యదర్శిగా మూడోసారిఎన్నికైన పసుపు లేటి లక్ష్మీకర్‌ను బలిజసంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.15 ఏళ్లుగా టిడిపిలో అవిశ్రాంతంగా కృషి చేసిన లక్ష్మి కర్‌ను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మండలకార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోతంశెట్టిరమేష్, పివి రమణ, రామచంద్ర, సత్యనారాయణ, నాగేంద్ర, ప్రసాద్, సురేష్ ,మల్లికార్జున, హరీష్, పివిఎస్‌లక్ష్మి కళావతి, మరియు బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే చింతలను మర్యాదపూర్వకంగా కలసిన రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్

**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**



అన్నమయ్యజిల్లా పీలేరు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీవిద్యార్థి విభాగంరాష్ట్ర అధి కార ప్రతినిధిగా నియా మకమైన సుంకర చక్రధర్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మర్యాదగాపూర్వ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లా డుతూ కూటమిప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తెలియజేసి, ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండలఅధ్యక్షుడు జగన్మో హన్ రెడ్డి సర్పంచ్ లోకనాథ్ రెడ్డి, భువనే శ్వర్ రెడ్డి ఆనంద్ కాలనీ చిన్న షబ్బీర్ చిన్న ఎల్లప్ప దావూద్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మృత్యుంజయ స్వామికి సోమవారం అభిషేక పూజలు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**
మండలకేంద్రమైన చౌడేపల్లి శ్రీఅభీష్టతమృత్యుంజయస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయఅర్చకులు ఉదయాన్నే పరమ శివునికి విశేషాభిషేకం అలంకరణ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి కాకుండా తమిళనాడు కర్ణాటక నుంచి అధికసంఖ్యలో భక్తులుతరలివచ్చిస్వామి వారి అభిషేక పూజలో పాల్గొన్నారు.వారం దరికీ పవిత్ర తీర్థప్రసా దాలు అందించారు.

# రెపరెపలాడిన ఎమ్మార్పీఎస్ జెండా ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు వైభవంగా జరిగినాయి,మండ లం ఇంచార్జ్ పగడాల గోవిందు ముత్యాల వెంకటరమణ( చిట్టి)ఆధ్వర్యంలో చౌడే పల్లి మండలం కోటూరు గ్రామంలో కోటూరు మల్లికార్జున అధ్యక్షతన జండా ఆవిష్కరణ కేకు కట్ చేయడం జరిగినది. ఇందులో పలగాలపల్లి రెడ్డన్న, శేఖర పందిళ్ళపల్లి దిగవింటి సుబ్రహ్మణ్యం ఏ సుబ్రహ్మణ్యం, ఆర్.సుబ్రహ్మణ్యం గంగలప్ప బుజ్జన్న కోటూరు గ్రామప్రజలు రాజేష్ గణేష్ దుర్గాప్రసాద్ వెంకటేష్ లోకేష్ నరసింహులు అలివేలు ఆదికేశవ కృష్ణప్ప భాగ్యమ్మ మహీధర్ అనురాధ గాయత్రి సునీత గంగమ్మ లక్ష్మీదేవి శివప్ప వెంకటరమణ మంజు భరద్వాజ్ లాస్య కావ్య తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు ఆరోగ్యశాఖ ఎం. సుబ్రమణియన్‌ను మర్యాదపూర్వకంగా ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**
తమిళనాడుకు చెందిన ఆరోగ్యశాఖ మంత్రివర్యులు ఎం. సుబ్రమణియన్‌ని కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎం. దొరస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలోని తమిళశాఖ విభాగం అభివృద్ధి సహకరించాలని కోరారు.మంత్రి విశ్వవిద్యాలయంలోని తమిళ శాఖకు నా సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఉపకులపతి వారిని నేరుగా తమిళనాడులోని సచివాలయంలో తనని కలవమని తెలియజేశారు. మంత్రికి విశ్వవిద్యాలయం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతలు స్వీకరిస్తున్న కడా పిడి వికాస్ మర్మ్మత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**
ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరిం చేందుకు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా ) ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.ఈ సమావేశానికి కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్,ఐఏఎస్ నేతృత్వం వహించారు. వివిధ శాఖల మండల,డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్లు, భూమి సమస్యలు, ఉద్యోగసమస్యలు, ఆరోగ్య సమస్యలు తదితర ప్రజల నుండి 41 అభ్యర్థన లుస్వీకరించబడ్డాయి. సమస్యలను వినతి పత్రాల రూపంలో తీసుకుని సంబంధిత శాఖలకు పంపించారు. అనంతరం అధికా రులకు పలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా ప్రజలనుండి అనేక సమస్యలు స్వీకరించుచున్నామని సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలలో పెండింగ్లో ఉన్న ఆర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేకదిష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపల పరిష్కరించాల్సి ఉంటుందని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ తెలిపారు.

# విజయవాడకు కుప్పం మీదుగా వందే భరత్ రైలు కోసం వినతి పత్రాలను అందించిన బిజెపి ఇంచార్జి తులసినాథ్

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**




బెంగళూరు నుండి విజయవాడకు కుప్పం మీదుగా వందే భారత్ రైలు ఏర్పాటు చేయాలని కుప్పం బిజెపి ఇంచార్జి తులసి నాథ్‌రైల్వే ఏజీఎంను కోరారు. సోమవారం కుప్పం రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన రైల్వే ఏజీఎంను కలిసి పలు రైల్వే సమస్యలను వివరించారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం మీదుగా విజయవాడకు వందే భారత్ రైలును ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యం ఉంటుందని రైల్వే కోరగా ఆయన సాను కూలంగా స్పందించారు.

# విజయవాడ ఆర్టీసీహౌస్‌లో జోనల్ చైర్మన్లతో సమీక్షాసమావేశం..

## నేటి ఏపీఎస్‌ఆర్టీసీ బోర్డ్ మీటింగ్‌కు ముందస్తు సమీక్ష నిర్వహించిన చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఏపీఎస్‌ఆర్టీసీ ఉపఅధ్యక్షులు కుప్పం నియోజకవర్గ ఇంచార్జ్ పీస్ మునిరత్నం.

**విజయవాడ, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07 :**



మంగళవారం జరగనున్న ఏపీఎస్ ఆర్టీసీ బోర్డ్ మీటింగ్ సందర్భంగా, ఆర్టీసీ జోనల్ చైర్మన్లతో సమీక్షా సమావేశాన్ని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఏపీఎస్ ఆర్టీసీ ఉపఅధ్యక్షులు పిఎస్ మునిరత్నం సోమవారం విజయవాడ ఆర్టీసీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు, జోనల్ చైర్మన్‌లు రెడ్డి అప్పలనాయుడు, సురేష్ రెడ్డి, దొన్ను దొర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ సేవల విస్తరణ, ప్రయా ణికులకు మెరుగైన సౌకర్యాల అందింపు, ఉద్యోగుల సంక్షేమం,ఆదాయ మార్గాల పెంపు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. రేపటి బోర్డ్ మీటింగ్‌లో ప్రాధాన్యతతో తీసుకోవాల్సిన నిర్ణయాల పై ఈ సమీక్షలో నేతలుతమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఏపీఎస్‌ఆర్టీసీని ఆర్థికంగా సమర్థవంతంగా మారుస్తూ, సామాన్య ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీఎస్‌ఆర్టీసీ ఉప అధ్యక్షులు పి ఎస్ మునిరత్నం తెలిపారు.

# టెక్నికల్ అసిస్టెంట్ బాలస్ సేవలు అభినందనీయం..



## ఎంపీడీవో మోహన్ మురళి

**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**
ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ బాలన్ సేవలు అభినందనీయమని ఎస్ఆర్‌పురం ఎంపీడీవో మోహన్ మురళి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ బాలన్ పదవి విరమణ సన్మాన కార్య క్రమం నిర్వహించారు అలాగే బదిలీపై వెళ్లిన ఏపీవో చంద్రశేఖర్‌ను అలాగే టెక్నికల్ అసిస్టెంట్ నోషాద్ టెక్నికల్ రామ్మూర్తి వీరిని సన్మానించి సత్కరించారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు శకుంతల జ్యోతి రేఖ జీవ రాజేష్ రవి నేతాజీ రాజేష్ సదా ఆనంద్ సుధాకర్ మునిరత్నం సురే ష్ గుణశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



# టెక్నాలజీ వినియోగించండి..

-మొదటిపేజీ తరువాయి



వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం.. దర్యాప్తు నిమిత్తం.. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హొటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు. అయితే అందిస్తున్న సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పిడుగులు పడే ప్రాంతాల్లో విలువైన ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని.. ముందస్తు హెచ్చరికల వ్యవస్థ సమర్ధంగా పనిచేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పర్యవేక్షణకు ఫీజియో మీటర్లు, సెన్సార్లు త్వరితగతిన పునరుద్ధరించాలని అన్నారు. రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీరెంత, ఎంతమేర ప్రవాహాలు వస్తున్నాయి. సముద్రంలోకి విడుదల చేస్తున్న నీరెంత లాంటి వివరాలు నమోదు చేయాలన్నారు. రిజర్వాయర్లలో వచ్చే ప్రవాహాలకు సంబంధించిన వివరాలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తే వరద నిర్వహణ చేయొచ్చన్నారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లనూ పూర్తి సామర్థ్యంతో నింపుతున్నట్టు సీఎం స్పష్టం చేశారు. మరోవైపు సముద్ర తీరప్రాంతాల్లో అలల ఉధతి, చేపల వేటకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ఇన్ కాయిస్ సంస్థ ఇచ్చే వివరాలను మత్స్యకారులకు, తీరప్రాంతాల్లోని వారికి అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రతీ ప్రభుత్వ శాఖ తమ దగ్గర ఉన్న లబ్దిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్ తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యత్యాసం ఉంటే తక్షణం ఆర్టీజీఎస్ కు తెలిపి డేటాను సవరించుకోవాలని స్పష్టం చేశారు. 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందుకు తగినట్టుగా సంక్షేమ పథకాల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. పేదరిక నిర్మూలన కోసం చివరి వ్యక్తి వరకూ చేయూత అందించటమే కూటమి ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబం%-% మార్గదర్శి అనుసంధాన ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు

# చంద్రబాబు వంద చెబితే..
# లోకేష్ రెండొందలు చెబుతున్నాడు

-మొదటిపేజీ తరువాయి

తాట తీస్తాం అని చంద్రబాబు, పవన్ కల్యాణ్ అంటున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు తేరగా ఉన్నారా?. ఒక్కసారి గ్రామాల్లో తిరగండి.. ఎవరికి మక్కెలు విరగకొడతారో తెలుస్తుంది.

మాయమాటలు చెప్పేవాళ్ళను మోసగాళ్ళని అనలా? వద్దా?. కూటమి అధికారంలోకి వచ్చి ఒక్క ఉద్యోగం ఇచ్చిందా?. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా మహిళలు, రైతులు మోసపోతారు. చంద్రబాబు వంద అబద్దాలు చెబితే.. లోకేష్ రెండు వందల అబద్దాలు చెబుతారు. ఏప్రిల్.. మే మాసంలో రైతులు అన్నదాత సుఖీభవ ఇస్తామని లోకేష్ అసెంబ్లీ సాక్షిగా చెప్పాడు. ఇప్పుడు ఏ నెల నడుస్తుందో రైతులు,ప్రజలు గుర్తించాలి. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంతో ప్రజల్లోకి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు వెళ్ళాలి అని బొత్స పిలుపు ఇచ్చారు.

పిఠాపురం వైఎస్సార్‌సీపీ ఇంఛార్జి వంగా గీతా మాట్లాడుతూ.. ఎన్నికల తరువాత పిఠాపురంలో వైఎస్‌ఆర్సీపీ కార్యకర్తలు నాకు వెన్నంటే ఉన్నారు. ఏలేరు వరదల సమయంలో జగన్ వెంట జనం ఉన్నారు అని చూపించారు.

దాడిశెట్టి రాజా మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చాక వీదికో రెండు బెల్టు షాపులు పెట్టారు. నాణ్యమైన గంజాయి వ్యాపారం చేసి యువత భవిష్యత్ నాశనం చేస్తున్నారు. చంద్రబాబు మాటలను రాష్ట్ర ప్రజలు విశ్వసించరు. చంద్రబాబు మాటలకు విలువలు.. విశ్వసనీ



యత ఉండదు. అందుకే బాబు హమీలకు నాది భాధ్యత అని గత ఎన్నికల్లో పవన్ చెప్పారు. ఇద్దరు మాటలు విని రాష్ట్ర ప్రజలు మోసపోయారు.

ధాన్యాగారంగా ఉన్న పిఠాపురంలో ఇప్పుడు రైతుల పరిస్థితి ఏమిటీ?. నాలుగు సార్లు ముఖ్యమంత్రి గా చేసిన చంద్రబాబు.. ఇప్పటి వరకు కుప్పాన్ని...స్వర్ణ కుప్పం ఎందుకు చేయ్యలేదు. సుపరిపాలనలో తొలి అడుగుకు టీడీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేస్తున్నారు.

జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అయిన తరువాత పిఠాపురం నియోజకవర్గం కు పవన్ ఎన్నిసార్లు వచ్చారు?. పిఠాపురం లో ప్రజల సమస్యల మీద ఒక్క క్షణం ఆలోచించే పరిస్థితిలో లేరు. వాలంటీర్ల ద్వారా అదృశ్యమయ్యారని చెప్పిన పవన్.. మరి ఆ మహిళలను వెనక్కి తీసుకువచ్చారా?. కాపు సామాజిక వర్గంలో యువత పవన్ ను హీరోగా భావించి వెనుక తిరిగారు. వారంతా ఇప్పుడు తమను తాము ప్రశ్నించుకోవాలి. పవన్ ముఖ్యమంత్రి అవ్వడం కోసం పార్టీ పెట్టారా?. లేదంటే చంద్రబాబును ముఖ్యమంత్రి ని చేయ్యడానికి పార్టీని పెట్టారా? చంద్రబాబు ను ముఖ్యమంత్రి చేయ్యాలని తాపత్రాయ పడే పవన్ ను హీరోగా చూడడం ఖర్మ.

వంగవీటి మోహన రంగా , ముద్రగడ పద్మనాభం లాంటి వాళ్ళను కాపులు హీరోలుగా చూడాలి. సినిమాలో నాలుగు స్టెప్పులు వేసి..బయటకు వచ్చి మైక్ పట్టుకున్న వ్యక్తిని హీరోగా చూడడం దౌర్భాగ్యం. రానున్న రోజుల్లో పవన్ కల్యాణ్‌కు, వంగా గీతా కు మధ్య ఉన్న వ్యత్యాసం పిఠాపురం ప్రజలకు కచ్చితంగా తెలుస్తుంది. రాజకీయంగా జన్మనిచ్చిన పిఠాపురం లో పవన్ అంతం అయ్యేలా వచ్చే ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలి.

తోట నరసింహం మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి వైఎస్ జగన్. దేశంలో ఏ రాష్ట్రం లో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. మేనిఫెస్టోను భగవత్ గీత,బైబిల్,ఖురాన్ గా ఆరాధించారు. మరో 15-20 ఏళ్ళు కూటమి కలిసే ఉంటుందని పవన్ అంటున్నారు. పిఠాపురం లోనే కూటమికి బీటలు వారాయి. జెండాలతో.. కుర్చీలతో కూటమి నేతలు కొట్టుకుంటున్నారు.

# కొత్త ఆటోలపై
# కీలక రూల్స్, మాఫియాకు చెక్!

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్లకు గుడ్ న్యూస్. కొత్త ఆటోల కొనుగోలుపై ఆంక్షలను ఇటీవల ఎత్తేసిన ప్రభుత్వం ఇప్పుడు మరిన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. మాఫియాకు అడ్డుకట్టవేసేలా కీలక నిర్ణయం తీసుకుంది. సిండికేట్‌లకు అవకాశం లేకుండా రూల్స్ ఫ్రేమ్ చేసింది. ఈ మేరకు జీవోను జారీ చేసింది. అవుటర్ రింగ్‌రోడ్ పరిధిలోపు ఉన్న వాళ్లకు మాత్రమే అవకాశం కల్పిస్తోంది. ఈ మధ్యనే ప్రభఉత్వం 65 వేల ఆటో పర్మిట్‌లకు ఓకే చెప్పింది ప్రభుత్వం. ఇందులో ఎలక్ట్రిక్ ఆటోలు 20 వేలు ఉంటే 10 వేల ఎల్పీజీ, మరో 10 వేలు సీఎన్‌జీ పర్మిట్‌లు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న ఎల్పీజీ, డీజిల్, పెట్రోల్ ఆటోలకు మార్పులు చేర్పులు చేసుకొని ఎలక్ట్రిక్‌గా మార్చుకునే వెసులుబాటు కల్పించింది. ఈ పర్మిట్‌లు ఎవరికి ఇవ్వాలనే అంశంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జీవో 263కి అనుగుణంగా ఈ రూల్స్‌ను రూపొందించారు. హైదరాబాద్‌లో పొల్యూషన్ కంట్రోల్ చేసేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు తీసుకుంటున్న నిర్ణయాల్లో భాగంగా ఆదివారం కీలక మార్గదర్శకాలు విడుదల చేసింది రవాణాశాఖ. తెలంగాణలోని ఏ డీలర్ వద్దైనా సరే ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపింది. అయితే హైదరాబాద్‌లో ఆ ఆటో తిప్పాలనుకునే వారు మాత్రమ లోకల్‌గా డ్రైవింగ్ లైసెన్స్, ఓఆర్ఆర్‌లోపు అడ్రెస్ ప్రూఫ్ ఉండాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్టు కచ్చితంగా ప్రూఫ్‌లు ఇవ్వాలి. కొనుగోలుదారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడా లేదా అనేది తేల్చాల్సిన బాధ్యత పూర్తిగా డీలర్లకే విడిచిపెట్టారు. వాహనం కొనుగోలు చేసినప్పుడు సదరు వ్యక్తి ఆటో లేదా కారు డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, పుట్టిన తేదీ, ఔటర్ పరిధిలో ఉంటున్నట్టు రెండు అడ్రస్ డాక్యుమెంట్స్ ఇవ్వాలి. ఆ తర్వాత వాహనం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతోంది. వాహనం కొనుగోలుదారు ఇచ్చిన వివరాలు సరిగా ఉంటే ప్రక్రియను ప్రారంభించి వాటిని సదరు డీలర్లు సీఎఫ్ఎస్‌టీ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎంటర్ చేయాలి. ఆ వివరాలను ఆర్టీఏ అధికారులు పరిశీలిస్తారు. 24 గంటల్లోనే దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంటుంది. సదరు వ్యక్తి ఇచ్చిన వివరాలు సరైనో కావో నిర్ధారించుకున్న తర్వాతే వాహనం కొనుగోలు ప్రక్రియ ముందుకెళ్తుంది. ఒకసారి ఆర్టీఏ అధికారులు సదరు వ్యక్తి వివరాలు నిర్ధారించిన తర్వాత డ్రైవర్లు వాహనం కొనుగోలు చేయాలి. ఈ కొనుగోలు కూడా 60 రోజుల్లో పూర్తి చేయాలి. ఆర్టీఏ అధికారుల నుంచి అనుమతులు వచ్చిన 60రోజులు అంటే రెండు నెలలోపు ఆటో కొనుగోలు చేయకుంటే ఆ అనుమతులు ఆటోమేటిక్‌గా రద్దు అవుతాయి. పర్మిట్లకు ఉన్న డిమాండ్ దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే పాత ఆటో పర్మిట్ ఉందని దాని స్థానంలో కొత్త ఆటో కొనేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఈ పర్మిట్‌ల ప్రక్రియ సజావుగా సాగేందుకు కొత్త సాఫ్ట్‌వేర్ క్రియేట్ చేశారు. ఆటో కొనుగోలు చేయాలనుకునే వ్యక్తులు డ్రైవింగ్ లైసెన్స్ అడ్రెస్‌తోపాటు మరో అడ్రెస్ ప్రూఫ్ ఏదైనా చూపించాలి. ఇలా చూపించి పర్మిషన్ తీసుకున్న వ్యక్తులకు ఒకరికి ఒక ఆటో పర్మిషన్ మాత్రమే ఇస్తారు. గతంలో ఆ వ్యక్తి పేరుపై ఆటో రిక్షాలు ఉంటే మాత్రం అనర్హులుగా ప్రకటిస్తారు. తన పేరు మీద ఎలాంటి ఆటో పర్మిషన్ లేదని అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది. తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. నిరుపేదలకు చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో తీసుకున్న ఈ నిర్ణయంతో ఎక్కువ మంది లబ్ధిపొందాలని ప్రభుత్వం చూస్తోంది. ముందుగా వచ్చిన వాళ్లకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. డీలర్లు కూడా ఆర్టీఏ అనుమతులు వచ్చిన వారికే ఆటోలు అమ్మాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలి.

## ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌ల నియామకం

హైదరాబాద్: సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేయడంలో కాంగ్రెస్ నిమగ్నమైంది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నియమించిన టీపీసీసీ.. తాజాగా ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. 10 జిల్లాల ఇన్‌ఛార్జ్‌లతో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జూమ్ వేదికగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విధివిధానాలను మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా ఇన్‌ఛార్జ్‌లంతా వెంటనే రంగంలోకి దిగాలని దిశానిర్దేశం చేశారు.

ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్‌లు..
ఖమ్మం - వంశీచంద్‌రెడ్డి
నల్గొండ - సంపత్ కుమార్
వరంగల్ - అడ్లూరి లక్ష్మణ్
మెదక్ - పొన్నం ప్రభాకర్
హైదరాబాద్ - జగ్గారెడ్డి
మహబూబ్‌నగర్ - కుసుమ కుమార్
ఆదిలాబాద్ - అనిల్ యాదవ్
కరీంనగర్ - అద్దంకి దయాకర్
నిజామాబాద్ - అజ్మతుల్లా హుస్సేన్
రంగారెడ్డి - శివసేన రెడ్డి

## కేటాయించిన శాఖలపై
## మంత్రి వాకిటి శ్రీహరి అసంతృప్తి

**హైదరాబాద్:** తనకు కేటాయించిన శాఖలపై మంత్రి వాకిటి శ్రీహరి అసంతృప్తి వ్యక్తం చేశారు. పదేళ్లలో ఆగమైన శాఖలను తనకు ఇచ్చారని అన్నారు. ఐదు శాఖలూ ఆగమాగంగానే ఉన్నాయన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'ఇది అదృష్టమో.. దురదృష్టమో తెలియదు. పశుసంవర్ధక శాఖ గందరగోళంగా ఉంది. యువజన సర్వీసులు ఇస్తే నేనేం చేసుకోవాలి? గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి?"అని అన్నారు. అంతకుముందు కరీంనగర్‌లో క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. క్రీడా పాఠశాలల అంతర్గత పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. కబడ్డీ, హ్యాండ్ బాల్ కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. కరీంనగర్ క్రీడా పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు.

## వైఎస్ఆర్సిపి పార్టీమండల యువత అధ్యక్షులుగా జ్ఞానేంద్ర రెడ్డి



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**
ఎస్ఆర్ పురంమండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీమండల యువత అధ్యక్షుడిగా జ్ఞానేంద్ రెడ్డి నియమించామని గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ కృపాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పురం మండలం పిల్లారి కుప్పం పంచాయతీ మూలూరు గ్రామానికి చెందిన జ్ఞానేంద్ర్ రెడ్డిని ఎస్ఆర్ పురం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువత అధ్యక్షుడిగా ఎన్నికవ్వడంతో నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మి మాజీడిప్యూటీ సీఎం నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్ఆర్‌పురం మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీబలోపేతానికి కృషిచేస్తానని జ్ఞానేందర్‌రెడ్డి తెలిపారు అనంతరం వైసిపి ఇన్చార్జి కృపా లక్ష్మి జ్ఞానేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గురువారెడ్డి, మండల అధ్యక్షుడు మణి, జనార్ధన్ మాజీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, వైసిపి యువ నాయకుడు శేషాద్రి రెడ్డి, వాసు నాయుడు మాజీ సర్పంచ్ ముత్తు, నాగరాజు శెట్టి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లింగస్థ నిర్ధారణ చట్ట రీత్యా నేరం
## గర్భిణీ స్త్రీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా చర్యలు
### అబార్షన్ మాత్రలు విక్రయించే వారిపై చర్యలు





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 07:**
లింగస్థ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఆర్డిఓ శ్రీనివాసరాజు హెచ్చరించారు. సోమవారం ఆర్డిఓ ఛాంబర్ లో డిప్యూటీ డిఎం అంటే డాక్టర్ గంగాదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు 896/1000 గా ఉందని ఇది చాలా తక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తున్న అంశం అన్నారు. లింగ ఎంపిక చేయడం నేరమన్నారు. ఇంక నిష్పత్తి సమా నంగా ఉండాలంటే గర్బ రావాలి ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యే కంగా సృష్టి సారించాలన్నారు. కుప్పం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున ఇక్కడి గర్భిణీలు తమిళనాడుకు వెళ్లే అవకాశం ఉందని అటువంటి కార్యకలాపాలను గమనిం చి ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అబార్షన్ మాత్రమే సరఫరా చేసే ఆర్ఎంపి పి.ఎం.పి లపై ఐసిడిఎస్ పోలీస్ విభాగాలు సంయుక్తంగా నిఘా పెట్టాలన్నారు. లింగ ఎంపికకు పాల్పడే వారిపై నిఘా ఉంచి వారి వివరాలతో సమారాచారం అంది స్తే లక్ష రూపాయ లు ఆగదు బహుమతులు జిల్లా కలెక్టర్ ప్రకటించారని వివరించారు. జిల్లాస్థాయిలో డికాయి ఆపరేషన్లో నిర్వహిస్తున్నామన్నారు. లింగ ఎంపిక చేసే స్కాన్ సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పిసీపీ ఎన్డిటి చట్టంలోని శిక్ష నిబంధనలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు గర్భిణీ స్త్రీలకు చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. అకాల వివాహాలపై అవగాహన కల్పించి నిర్ధారణపై స్పష్టమైన వివరాలు అందజేయాలన్నారు. సమావేశం లో డిఎస్పి, వైద్యాధికారులు, ఎన్జీవో కమిటీ మెంబర్లు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, విద్య, అధికారులు పాల్గొన్నారు.

## కూటమితోనే సుపరిపాలన బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**
శ్రీకాళహస్తి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగో వార్డ్ నందు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులు గురించి వివరిస్తూ కరపత్రాలు అందించారు. ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనం, దీపం పథకం, వంటి పథకాలు అందని వ్యక్తులు అధైర్యపడాల్సిన అవసరంలేదు మిగిలిన వారికికూడా ప్రభుత్వంమరలా పథకాల ను అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య, క్లస్టర్ ఇంచార్జ్ పేట బాలాజీ, నాలుగో వార్డ్ ఇంచార్జ్ రామ్మూర్తి, ఉపాధ్యక్షులు రాంబాబు, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కే బాబు, నాలుగో వార్డ్ బూత్ ఇంచార్జ్ ఉలస సుబ్రహ్మణ్యం, సుజిత్, రాజా, చెంచయ్య, గణేష్, మధు, చంద్ర శేఖర్, శ్రీనివాసులు, వంశీ, మురళి టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 07:**
అన్నమయ్య జిల్లా పీలేరు మహా జననేత పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశానుసారం ఎంఆర్పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పీలేరు మండలంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి జన్మదినవేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీలేరుమార్కెట్ కమిటీ చైర్మన్ పురంరామ్మూర్తి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర్ హాజరై మంద కృష్ణ మాదిగ జన్మదినకేకును కట్ చేశారు. సంవత్సరాలుగ మాది ఎమ్మార్పీఎస్ ఉద్య మంత చేపట్టి పిఎస్ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఖాదర్, ఎస్టి నాయకులు సురేష్ నాయక్, బీసీనా యకులు ఆర్ఎస్ చిన్న,ఎంఎస్పి పీలేరు నియోజకవర్గం కో ఇన్చార్జి ముది వేడు శ్రీనివాసులు, ఎంఆర్పిఎస్ ఎంఎస్పి సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, రాచపల్లి వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ నాయకులు గండికోట రెడ్డి కుమార్, ఎంఎస్పి నాయకులు బండ్ల వంక పివి రమణ, బాలసుబ్రమణ్యం, ఎర్రబల్లి మురళి, ఎర్రబల్లి సుబ్రహ్మణ్యం, నరసింహులు, శంకర, వంశి, అనిల్, విహెచ్పిఎస్ నాయకులు అమర్నాథరెడ్డి సుభహాన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో మరింత తగ్గనున్న బంగారం ధరలు!

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) తన బంగారం నిల్వలను 880 మెట్రిక్ టన్నుల వద్ద స్థిరంగా ఉంచుకుంది. బంగారం ధర తగ్గుదల, వివిధ మార్కెట్ విశ్లేషణల ఆధారంగా కొత్త బంగారం కొనుగోళ్లు లేవు. ప్రపంచ రాజకీయ పరిస్థితులు, వడ్డీ రేటు తగ్గుదల అంచనాల కారణంగా బంగారం ధర మరింత తగ్గుతుందని ఆర్బీఐ భావిస్తోంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న బంగారు నిల్వలను అలాగే కొనసాగించింది. బంగారం ధర తగ్గుదల కారణంగా కొత్తగా బంగారం కొనకూడదనే వ్యూహాన్ని అనుసరించింది. ప్రపంచ వాణిజ్యం, రాజకీయ అస్థిరత కారణంగా ఐదు సంవత్సరాలలో బంగారం ధరలు 80 శాతం పెరిగాయి. ఇటీవలి డేటా ప్రకారం.. ఈ సంవత్సరం మార్చి చివరి నుండి మే చివరి వరకు ఆర్‌బిఐ బంగారం నిల్వలు 880 మెట్రిక్ టన్నుల వద్ద స్థిరంగా ఉన్నాయి. ఇది ఒక సంవత్సరంలో కొనుగోళ్లు లేకుండా అత్యంత పొడిగించిన కాలాన్ని సూచిస్తుంది. గతంలో 2023 అక్టోబర్-డిసెంబర్ మధ్య కాలంలో కొనుగోళ్లు నిలిపివేసింది. ఆ కాలంలో ఆర్బీఐ వద్ద 804 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వ ఉంది. వివిధ మార్కెట్ల విశ్లేషణ తర్వాత ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. సిటీ, ఫిచ్ పరిశోధన విభాగం, మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్, ×జ×జ× బ్యాంక్ ధరల అంచనాలు ట్రాయ్ ఔన్సుకు 3,445 డాలర్ల నుండి తగ్గుదలని సూచిస్తున్నాయి. ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతలలో సంభావ్య తగ్గింపు, ఖా ఫెడరల్ రిజర్వ్ ద్వారా



అంచనా వేసిన వడ్డీ రేటు తగ్గింపులను పేర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బంగారం ధర మరింత తగ్గుతుందనే అంచనాతో ఆర్బీఐ ప్రస్తుతం బంగారం కొనుగోలు చేయకూడదని భావిస్తోంది. జూన్ మధ్యలో నిర్వహించిన వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (ఔ+జ) సర్వే ప్రకారం.. సెంట్రల్ బ్యాంకర్లు బంగారం పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారు. దాదాపు సగం కేంద్ర బ్యాంకుల స్పందనలను కలిగి ఉన్న ఈ అధ్యయనంలో.. 95 శాతం మంది పాల్గొనేవారు ప్రపంచ సావరిన్ రిజర్వ్ మేనేజర్లు రాబోయే 12 నెలల్లో తమ బంగారు నిల్వలను విస్తరిస్తారని అంచనా వేస్తున్నారని సూచించింది. "సంక్షోభ సమయాల్లో బంగారం పనితీరు, ప్రభావవంతమైన పోర్ట్‌ఫోలియో డైవర్సిఫైయర్‌గా దాని ఉపయోగం, దీర్ఘకాలిక విలువ నిల్వగా దాని పాత్ర కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కలిగి ఉండటానికి మొదటి మూడు అత్యంత సంబంధిత కారణాలు" అని ఔ+జ సర్వేకు ప్రతివాదులు ఫైనాన్షియల్ డైలీ నివేదిక ప్రకారం తెలిపారు. ఔ+జ 'ట్రెండ్స్ ఇన్ రిజర్వ్ మేనేజ్‌మెంట్ 2024' సర్వే రిజర్వ్ మేనేజర్లు భౌగోళిక రాజకీయ పెరుగుదలను తమ ప్రాథమిక ఆందోళనగా భావిస్తున్నారని హైలైట్ చేసింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ సంఘర్షణలు ఆంక్షలకు నిల్వలు గురయ్యే అవకాశం ఉందని దృష్టిని ఆకర్షించాయి. ఇది విదేశీ ఆస్తులను యాక్సెస్ చేయడం, ఉపయోగించడాన్ని పరిమితం చేస్తుంది. ఈ సందర్భంలో రిజర్వ్ మేనేజర్లు బంగారాన్ని తమ అత్యంత సురక్షితమైన పెట్టుబడి ప్రత్యామ్నాయంగా భావిస్తారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న రిజర్వ్ మేనేజర్లు తమ హోల్డింగ్‌లను ప్రత్యేక వర్గాలుగా కేటాయిస్తారు, వీటిలో తక్షణ అవసరాల కోసం లిక్విడిటీ ట్రాన్చే, మెరుగైన రాబడిని ఉత్పత్తి చేయడానికి ఉద్దేశించిన పెట్టుబడి ట్రాన్చే ఉన్నాయి" అని సెంట్రల్ బ్యాంక్ ఇటీవలి వార్షిక నివేదికలో పేర్కొంది. ఆర్బీఐ తాజా వార్షిక నివేదిక ప్రకారం.. నికర విదేశీ ఆస్తులలో బంగారం నిష్పత్తి మార్చి 2025 చివరి నాటికి 12 శాతం పెరిగింది.

# ఇందులో ఇన్వెస్ట్ చేస్తే రెట్టింపు ఆదాయం

మంచి ఆదాయం పొందేందుకు రకరకాల మార్గాలు ఉన్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి ఇచ్చే స్కీమ్స్ చాలా ఉన్నాయి. అయితే పోస్ట్ ఆఫీస్‌లో తక్కువ సమయంలో ఎక్కువ రాబడి ఇచ్చే స్కీమ్స్ కూడా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ తమ డబ్బు సురక్షితంగా ఉండాలని, దానిపై మంచి లాభం కూడా పొందాలని కోరుకుంటారు. మీరు కూడా మీ డబ్బు సురక్షితంగా ఉండటమే కాకుండా కొంతకాలం తర్వాత రెట్టింపు అయ్యే పథకం కోసం చూస్తున్నట్లయితే, పోస్టాఫీసు ప్రత్యేక పథకం కిసాన్ వికాస్ పత్ర. ఇది ప్రభుత్వం నిర్వహిస్తున్న పొదుపు పథకం. దీనిలో మీ డబ్బు నిర్ణీత సమయంలో రెట్టింపు అవుతుంది. కిసాన్ వికాస్ పత్ర అనేది పోస్టాఫీసు ప్రభుత్వ పథకం. ఇది పెట్టుబడిదారుల డబ్బు రెట్టింపు అవుతుందని హామీ ఇస్తుంది. మీరు ఈ రోజు ఈ పథకంలో డబ్బు పెట్టుబడి పెడితే మీ పెట్టుబడి 115 నెలల్లో (9 సంవత్సరాల 7 నెలలు) రెట్టింపు అవుతుంది. ప్రత్యేకత ఏమిటంటే, దీనిలో పెట్టుబడి పెట్టడం ప్రారంభించడానికి మీకు ఎక్కువ డబ్బు అవసరం లేదు. మీరు ఈ పథకంలో కేవలం రూ. 1000తో పెట్టుబడి పెట్టడం ప్రారంభించవచ్చు. ఈ పథకంలో గరిష్ట పెట్టుబడి పరిమితి లేదు. అంటే, మీరు మీకు కావలసినంత డబ్బు పెట్టుబడి పెట్టవచ్చు. కిసాన్ వికాస్ పత్ర పథకంలో మీకు వార్షిక ప్రాతిపదికన 7.50 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. ఈ పథకం మెచ్యూరిటీ వ్యవధి 115 నెలలు. అంటే, మీరు దీనిలో డబ్బు పెట్టుబడి పెడితే ఈ కాలం తర్వాత మీ డబ్బు మీకు రెట్టింపుగా తిరిగి వస్తుంది. ఉదాహరణకు, మీరు రూ. 1 లక్ష పెట్టుబడి పెడితే, మెచ్యూరి టీ తర్వాత మీకు రూ. 2 లక్షలు వస్తాయి. అదేవిధంగా, మీరు రూ. 5 లక్షలు పెట్టుబడి పెడితే, మెచ్యూరిటీ తర్వాత మీకు రూ. 10 లక్షలు వస్తాయి. చాలా కాలం పాటు సురక్షితమైన పెట్టుబడిని కోరుకునే వారికి ఈ పథకం ప్రత్యేకమైనది.ఈ పథకం మరో ప్రత్యేకత ఏమిటంటే మీరు మీ పిల్లల కోసం కూడా దీనిలో పెట్టుబడి పెట్టవచ్చు. మీ బిడ్డకు 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉంటే,



మీరు వారి పేరు మీద కిసాన్ వికాస్ పత్ర అకౌంట్‌ను కూడా తెరవవచ్చు. పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేయడానికి ఇది మంచి మార్గమనే చెప్పాలి. ఈ పథకంలోని డబ్బు పూర్తిగా సురక్షితం. ఎందుకంటే ఇది ప్రభుత్వ హామీతో వస్తుంది. మీరు మీ సమీప పోస్టాఫీసుకు వెళ్లడం ద్వారా ఈ పథకంలో పెట్టుబడి పెట్టడం సులభంగా ప్రారంభించవచ్చు. మీరు చిన్న మొత్తంతో ప్రారంభించినా లేదా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టినా ఈ పథకం మీకు సరైనది. కిసాన్ వికాస్ పత్రలో పెట్టుబడి పెట్టడం ప్రారంభించడం చాలా సులభం. మీరు మీ దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లాలి. అక్కడ మీరు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, చిరునామా రుజువు వంటి కొన్ని ముఖ్యమైన పత్రాలను సమర్పించాలి. దీని తర్వాత మీరు రూ. 1000 నుండి ఏదైనా మొత్తాన్ని పెట్టుబడి పెట్టవచ్చు. పెట్టుబడి పెట్టిన తర్వాత మీకు ఒక సర్టిఫికేట్ లభిస్తుంది. అది మీ పెట్టుబడికి రుజువుగా ఉంటుంది. మెచ్యూరిటీ తర్వాత మీరు మీ డబ్బును సులభంగా ఉపసంహరించుకోవచ్చు.

# పృథ్వీ షా సంచలన నిర్ణయం

స్పోర్ట్స్

టీమిండియా యువ ఆటగాడు పృథ్వీ షా సంచలన నిర్ణయం తీసుకున్నాడు. క్రికెటర్‌గా తనకు గుర్తింపునిచ్చిన ముంబైతో బంధాన్ని తెంచుకున్నాడు. తదుపరి (2025-26) దేశవాలీ సీజన్ కోసం మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నాడు. షా ఇటీవలే కోసం ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు దరఖాస్తు చేసుకోగా, తాజాగా అది జారీ అయ్యింది. షా క్రమశిక్షణారాహిత్యం కారణంగా గత సీజన్‌లో ముంబై రంజీ జట్టులో స్థానం కోల్పోయాడు. అయితే డిసెంబర్ 14న జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ ఫైనల్‌లో మాత్రం ఆడాడు. ఆ మ్యాచ్ షా రాణించనప్పటికీ ముంబై ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో మధ్యప్రదేశ్‌పై విజయం సాధించింది. ఇదే షాకు ముంబై తరపున ఆఖరి మ్యాచ్. షా ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు. క్రికెటర్‌గా తనకు జన్మనిచ్చిందని అన్నాడు. తనకు ఇచ్చిన అవకాశాలకు కృతజ్ఞతలు తెలిపాడు. మహారాష్ట్రకు ఆడే ఆశాజనకమైన అవకాశాన్ని కాదనుకోలేకపోయానని తెలిపాడు. ఈ మార్పును (ముంబై నుంచి మహారాష్ట్రకు) తన క్రికెట్ ప్రయాణంలో ముందడుగుగా అభివర్ణించాడు. ఇది తన అభివృద్ధికి దోహదపడుతుందని నమ్ముతున్నానని అన్నాడు.



25 ఏళ్ల పృథ్వీ షా కెరీర్ హీన దశలో ఉన్నప్పుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ముంబై తరపున అవకాశాలు దాదాపుగా కనుమరుగు కావడంతో ఈ సాహసం చేశాడు. సహజంగా క్రికెటర్లకు ముంబై తరపున ఆడుతుంటేనే జాతీయ జట్టులో అవకాశాలు వస్తుంటాయి. అలాంటిది షా ముంబైని వీడి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు. 2018లో టీమిండియా తరపున అరంగేట్రంలోనే సెంచరీ చేసి భవిష్యత్ తారగా కీర్తించబడిన షా.. వివాదాలు, ఫిట్‌నెస్, పేలవ ఫామ్ కారణంగా జాతీయ జట్టుకు దూరమయ్యాడు. ఇవే కారణాలుగా అతను దేశవాలీ జట్టులోనూ చోటు కోల్పోయాడు. షాను తాజాగా ముగిసిన ఐపీఎల్‌లోనూ ఏ ఫ్రాంచైజీ తీసుకోలేదు. షా కెరీర్ ప్రస్తుతం అగమ్యగోచరంగా ఉంది. ఈ దశలో అతను ముంబైని వీడి మహారాష్ట్రకు ఆడటానికి ఒప్పందం చేసుకున్నాడు.
షా తదుపరి దేశవాలీ సీజన్‌లో మరో టీమిండియా యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి ఆడతాడు. రుతురాజ్ మహారాష్ట్రకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అన్నీ కుదిరితే షా, రుతురాజ్ మహారాష్ట్ర తరపున ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు.

## కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే ట్రిపుల్ సెంచరీ.. కొద్దిలో లారా రికార్డు మిస్!

సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రికార్డుల హోరును మరవకముందే మరో క్రికెటర్ చరిత్ర సృష్టించాడు. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే ట్రిపుల్ సెంచరీతో చెలరేగాడు వియాన్ మల్డర్ జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో మల్డర్ విధ్వంసక బ్యాటింగ్‌తో దడ పుట్టించాడు. దాంతో, సఫారీల తరఫున టెస్టుల్లో అత్యధిక స్కోర్ బాదిన ఆటగాడిగా నిలిచాడు. 367 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. లేదంటే బ్రియాన్ లారా పేరిట ఉన్న రికార్డు కనుమరుగయ్యేది. బులవయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో ప్రత్యర్థి బౌలర్లను ఉతికారేసిన మల్డర్.. శతకంతో సంతృప్తి చెందలేదు. ద్విశతకం తర్వాత మరింత రెచ్చిపోయిన సఫారీ సారథి వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా రికార్డుకు చేరువయ్యాడు. అతడి జోరు చూస్తే 11 ఏళ్ల క్రితం ఇంగ్లండ్‌పై లారా 400లతో నెలకొల్పిన స్కోర్ బద్ధలవ్వడం ఖాయం అనిపించింది. క్రికెట్ పండితులు సైతం మల్డర్ అత్యధిక స్కోర్‌తో కొత్త చరిత్ర లిఖిస్తాడని అనుకున్నారు. కానీ, అతడు మాత్రం అనూహ్యంగా ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. లేదంటే.. కరీబియన్ లెజెండ్ రికార్డు కనుమరుగయ్యేది. క్రీజులో పాతుకుపోయి జింబాబ్వే బౌలర్లకు చుక్కలు చూపించిన మల్డర్ 334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్సర్లతో 367 పరుగులు సాధించాడు.

**టెస్టుల్లో అత్యధిక స్కోర్**

బ్రియాన్ లారా (వెస్టిండీస్) - 400 నాటౌట్, 2004లో ఇంగ్లండ్‌పై.
మాథ్యూ హెడెన్(ఆస్ట్రేలియా) - 380 పరుగులు, 2003లో జింబాబ్వేపై.
బ్రియాన్ లారా (వెస్టిండీస్) - 375 పరుగులు, 1994లో ఇంగ్లండ్‌పై.
మహేళ జయవర్దనే(శ్రీలంక) - 374 పరుగులు, 2008లో దక్షిణాఫ్రికాపై.
వియాన్ మల్డర్ (దక్షిణాఫ్రికా) - 367 నాటౌట్, 2025లో జింబాబ్వేపై.



## బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో భారీ ఓటమి.. లార్డ్స్ టెస్ట్ కోసం డేంజరెస్ బౌలర్‌ను దించుతున్న ఇంగ్లండ్..!



బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో ఇంగ్లండ్ ఘోర పరాజయం పాలైంది. 336 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. ఈ నెల 10 నుంచి మూడో టెస్ట్ జరుగనున్నది. తొలి టెస్ట్‌లో గెలిచిన ఇంగ్లండ్ జట్టు.. రెండోటెస్టులో ఎలాంటి మార్పులు చేయలేదు. ఘోర పరాజయంతో లార్డ్స్ వేదికగా జరిగే ఈ మ్యాచ్ కోసం ఆతిథ్య జట్టు కీలక మార్పులు చేసింది. రెండో టెస్టులో బౌలర్లు పెద్దగా రాణించకపోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకున్నది. బ్రైడాన్ కార్స్, జోష్ టంగ్, క్రిస్ వోక్స్ త్రయం అద్భుతం చేయలేకపోయింది. ఈ క్రమంలో ప్లేయింగ్-11లో పేసర్ గస్ అట్కిన్సన్‌ను మూడో టెస్టుకు ఎంపిక చేసింది. ఇంగ్లండ్ జట్టు జోఫ్రా ఆర్చర్‌తో పాటు జామీ ఓవర్టన్‌కు ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉన్నది. ఓవర్టన్, అట్కిన్సన్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ చేసే సత్తా ఉన్నది. దాంతో జట్టు ప్రయోజనకరంగా ఉండనున్నది. లార్డ్స్ మైదానం ఫాస్ట్ బౌలర్లకు ఉపకరిస్తుంది. ఈ క్రమంలో షోయబ్ బషీర్ స్థానంలో అదనంగా ఫాస్ట్ బౌలర్‌ను ఆడించాలని భావించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో క్రిస్ వోక్స్ లేదంటే కార్సేకు అవకాశం ఇవ్వొచ్చు. అదే సమయంలో ఓ బ్యాట్స్‌మన్‌కి విశ్రాంతి ఇస్తే.. జాకబ్ బెథెల్‌ను తుదిజట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. బెథెల్ స్పిన్ బౌలింగ్ కూడా చేయగలడు. రెండోటెస్టులో ఐదురోజు వర్షం కారణంగా ఆట ఆలస్యంగా మొదలైంది. ఆ తర్వాత టీమిండియా ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఇంగ్లండ్‌ను 336 పరుగుల తేడాతో భారత్ ఓడించి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. బర్మింగ్‌హామ్ టెస్టులో ఆకాశ్ 186 పరుగులు ఇచ్చి పది వికెట్లు కూల్చాడు. స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో ఆకాశ్ దీప్ అద్భుత బౌలింగ్‌తో టీమిండియాకు విజయాన్ని అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇన్నింగ్స్‌లో 88 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీయగా.. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 99 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు తీశాడు. 608 పరుగుల అసాధ్యమైన లక్ష్య చేధనలో ఆతిథ్య జట్టు 271 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143